

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవాసమితి ప్రచురణ)

సంపుటి : 9    ఏప్రిల్, 2013    సంచిక : 11

(విజయ నామ సం॥, చైత్ర మాసం)

**గౌరవ సంపాదకత్వం**

**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ**

**ప్రధాన సంపాదకత్వం**

**శ్రీ మాతా శుకవాణి**

భాషా ప్రవీణ, M.O.L.,M.A

**ప్రత్యేక సహకారం**

**శ్రీ వి.వి. కృష్ణారావుగారు (సాయిశ్రీ ప్రింటర్స్)**

**ప్రచార సారథ్యం**

**శ్రీ ఎం. సత్యనారాయణగారు** M.Tech

**సాయివాణి చందా వివరాలు**

| | | | |
|---|---|---|---|
| విడి ప్రతి | .......... | రూ॥ | 6/- |
| వార్షిక చందా | .......... | రూ॥ | 60/- |
| ఆజీవన సభ్యత్వం | .......... | రూ॥ | 600/- |

**చిరునామా :-**

**సాయివాణి**

C/o **శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు**

సాయిధామం, రామలింగంపల్లి(పోస్టు),

బొమ్మల రామవరం మండలం,

నల్గొండ జిల్లా - 508 126. ఆం.ప్ర.

**Ph : 9440413455, 9848133565**

Website : www.saidhamam.org

E-mail : saidhamam.seva@gmail.com, saidhamam.ram@gmail.com

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి .......... 2

బల్లమీద నిద్ర ఏమిటి? .......... 5

ధ్యానమందిరం అంటే .......... 7

స్వరాంజలి .......... 8

మా గురుకృప .......... 9

కబీరు అమృతవాణి .......... 11

కలలో కరుణ .......... 12

గ్రంథ స్వీకారం .......... 16

శ్రీ సాయి సేవ .......... 17

షిరిడీ (కపర్దే) డైరీ .......... 19

నేర్చుకోండి .......... 21

బంధము-ముక్తి .......... 22

మాతృసంస్థ కబుర్లు .......... 24







# మా వాణి



సాయివాణి పాఠకలోకమంతటికీ నవ సంవత్సర శుభాకాంక్షలు. “విజయ నామ సంవత్సరం మీ అందరు తలపెట్టిన ప్రతి సత్కార్యానికీ విజయాన్ని అందించుగాక! ఈ భరతభూమికి ఏ విధమైన గ్లానీ కలగకుండా విజయాలు లభించుగాక! హైందవ ధర్మానికి నిరంతర విజయం ప్రసాదింపబడును గాక! విద్యా, వైద్య, సాంకేతిక, వైజ్ఞానిక, కళా, క్రీడా, సాంస్కృతిక, సాంప్రదాయిక, ధార్మిక రంగాలన్నింటిలోనూ విజయ నామ సంవత్సరం యీ భారతాంబకు అప్రతిహతిమైన విజయాలనే అందించుగాక!” - ఇది పరమపూజ్య గురుదేవుల ప్రేమాశీస్సు.

గత నందన నామ సంవత్సరంలో మనకు ఆనందం కన్నా విషాదమే ఎక్కువ మిగిలింది. చిత్రవిచిత్రమైన స్కామ్‌లు, ఎన్నడూ కనీవినీ ఎరుగని దౌర్జన్యాలు, హద్దూపద్దూ లేని నాయకమ్మన్యుల వాగుళ్ళు, ఆడపిల్లల జీవితాలను చిదిమి నాశనం చేసే దున్నపోతుల స్వైరవిహారాలు, స్వాభిమానం, స్వావలంబనం మరచి కుక్క బిస్కట్లకో మరే ముక్కలకో చేతులు చాపుతున్న జాతిభ్రష్టులు, ఈ దేశాన్నింతకన్నా గౌరవించటం వ్యర్థ మన్నట్లు ప్రవర్తించే కొన్ని విదేశాలు, డజన్లకొద్దీ వందలకొద్దీ జనాన్ని మూక ఉమ్మడిగా హతమార్చిన దౌర్భాగ్యులను ఏళ్ల తరబడి మేపాక శిక్షించినా సరే- గుండెలు బాదుకొనే కుహనా మానవతావాదులు, యువత అంటే కేవలం భుక్తి విద్యకు - తనూ విలాసాలకే తప్ప సమాజం పట్లగానీ, దేశం పట్లగానీ బాధ్యులు కారన్నట్లు ప్రవర్తించే కొందరు యువతీ యువకులు .... ఎటు పోతున్నాం? - అలా నందన భయపెట్టి వెళ్లింది. ఈ వచ్చే ‘విజయై’నా మన గాయాలు మాన్పుతుందని ఆశిద్దాం.

శ్రీరామనవమి ఏప్రిల్ 19న వస్తున్నది. ప్రతి హిందువు తన యింట్లో పెళ్లి అన్నట్లు సంబరపడే వాడొకప్పుడు. తొమ్మిది రోజుల కళ్యాణోత్సవాలలో హరికథలు, బుర్రకథలు, చెక్క భజనలు, నాటకాలు, పురాణ ప్రవచనాలు, తోలు బొమ్మలాటలు, నాట్యాలు-ఎన్ని కళారూపాలుంటే అన్నీ ప్రదర్శింపబడేవి. నిరక్షరాస్యులకు కూడా ఇతిహాస (చరిత్ర) కథలన్నీ తెలిసేవి. కళాపిపాసువులకు దాహం తీరేది. కళాకారులక్కూడా రెండు మూడు నెలల గ్రాసం దొరికేది. కాలం మారింది. రికార్డు డాన్సులు వచ్చాయి. వెర్రి తలలు వేసిన సినిమాపిచ్చితో మత్తెక్కిపోయిన జనం వెకిలితనాలతో అసహ్యకర పరిస్థితులకు దారితీసాయి అవి. ఇక సినిమాలు రంగప్రవేశం చేసాయి. అంతే-శ్రీరామనవమి పందిళ్లలో ఏదో మొక్కుబడిగా బ్రాహ్మడు పూజచేసి (ఆయనొక్కడే నాలుగైదు చోట్ల చెయ్యాలి మరి!) వెళ్లిపోయాక-ఆ పందిళ్లు పూర్వకాలపు టూరింగ్ సినిమాహాళ్ల స్టైల్‌లో మిగిలిపోతాయి ప్రతి రాత్రీ.

అయ్యా, పొరుగువారిని చూచైనా బుద్ధి తెచ్చుకోవాలి మనం. పండగలంటే నాలుగు రకాలు వండుకు తినటం-తాగటం - క్రొత్త బట్టలు వేసుకోవటం-యింత మాత్రమేనా! సాటి (వి)ధర్మాలవారు తమ పండుగలు ఎంత నిష్ఠగా, పద్ధతిగా జరుపుకొంటున్నారో చూడండి. ఈసారి అందరూ శ్రీరామనవమికి పందిళ్లలో కళాప్రదర్శనలుండేలా చందాలు దండుకొనే వారిని ప్రోత్సహించండి.

మీ యింట్లో సీతారామకళ్యాణం చేసుకోండి. అవన్నీ మాకేం తెలుసు! అంటారా! కనీసం శ్రీరామజననం చేసుకోండి. ఓ ఉయ్యాల కట్టి రామ విగ్రహాన్ని లేదా ఫొటోను అందులో ఉంచి జోలలు పాడండి. పదిమంది పిల్లలకు ప్రసాదం పంచండి. పదిమంది ముత్తైదువలకు తాంబూలాలు, పండు, సెనగలు వాయనం యివ్వండి. నాలుగు అక్షరాలు వచ్చినవారు రాని వారికి రామకథ చెప్పండి. నాలుగు భజనలో, కీర్తనలో వస్తే





పాడుకోండి. రాకపోతే "శ్రీరామ జయరామ జయ జయరామ- జయ జయరామా జానకిరామా" ఈ భజన ఓ పదినిముషాలు చెప్పకోండి. మీకు భగవంతుడు శక్తినిస్తే ఓ పేద దంపతులను పిలిచి సీతారాములుగా భావించి బట్టలు పెట్టండి. ఆయనకో పంచె తువ్వాలూ, ఆమెకో రెండు రవికె బట్టలు పసుపు, కుంకుమ యిచ్చినా చాలు. చెప్పండి-ఈ పాటి చెయ్యలేమా! మన దేశాన్ని చల్లగా పాలించిన ప్రభువు, నాటికీ నేటికీ ఏకపత్నీవ్రతుడనగానే గుర్తు వచ్చే ధర్మవీరుడు, తాను ప్రాణంగా ప్రేమించిన యిల్లాలిని, నిండు చూలాలిని - తన కర్తవ్య పాలనే ధ్యేయంగా దూరం చేసుకొన్న త్యాగమూర్తి - ఆయన పేరిట యీ మాత్రం చెయ్యలేమా? స్వజాతి గౌరవాన్ని నిలుపుకొని చైతన్యం నింపుకోలేమా!

ఆఁ - యివన్నీ ఎందుకులెద్దురూ అంటారా! సరే, మీ యిష్టం - చిటికె వేసేంతలో, కనుమూసి తెరిచేంతలో మొత్తాన్ని లేపిపారేస్తామన్న బెదిరింపులూ, మా జోలికి వస్తే ఖబడ్దార్ అన్న అదిలింపులూ, మీ కళ్ల ముందే మీ వాళ్లంతా ముక్కలు చెక్కలై ఎగిరి చెదిరిపడే సుందర దృశ్యాలూ చూస్తూ, వింటూ యిలాగే జీవిద్దాం. ఆఁ పోనిద్దురూ పాడు జీవితాలు - ఉంటే ఎంత, పోతే ఎంత! మనం సెక్యులర్ - మన బుద్ధి పెక్యూలియర్. సెలవ్!

పరమపూజ్య గురుదేవులు

శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు

సాయివాణి పాఠకులందరికీ

విజయ సంవత్సరాది, శ్రీరామనవమి

శుభాశీస్సులు అందిస్తున్నారు-దోసిలొగ్గండి

# బల్ల మీద నిద్ర ఏమిటి?

\- మాతాజీ

శ్రీ సాయిదేవులకు జానెడు వెడల్పు, నాలుగు మూరల పొడవు వున్న చెక్క బల్లను ఎవరో తెచ్చి యిచ్చారు. ఆయన పాత గుడ్డపీలికలను తాడులాగా పేని, ఆ త్రాటి సాయంతో పైనున్న దూలానికి వ్రేలాడగట్టారు. అది కూడా చాలా ఎత్తున. ఆ చిన్న బల్ల మీద నాలుగు మూలలా నాలుగు దీపాలు వెలిగించి ఉంచేవారు. క్రింది నుండీ పైకి ఎలా ఎక్కుతారో ఎవ్వరికీ అర్థం కాకుండానే కనుమూసి తెరిచేలోగా ఆ బల్ల మీదికి ఎక్కేవారు. జనం ఆ రహస్యం కనుక్కోవాలని దృష్టి దాని మీదనే ఉంచుతున్నందుచేత దాన్ని విరిచిపారేసారొకనాడు. కాకా మళ్లీ తానొక బల్ల కొంటానంటే 'మహల్సాపతిని క్రిందనే విడిచి ఒక్కడినే వెళ్లటం నాకు ఇష్టం లేద'న్నారు బాబా. అతనికి కూడా మరొకటి కొంటానన్నాడు శ్యామా. అందుకు బాబా యిలా అన్నారు -

"అంత ఎత్తున పడుకొనుట సులభమైన విషయం కాదు. ఎవరయితే కండ్లు తెరిచి నిద్రించగలరో వారికే అది వీలగును. ఎవడయితే నేలపై చక్కగా నిద్రించలేడో, ఎవడు కదలకుండా ఉండలేడో, ఎవడు నిద్రకు సేవకుడో వాడు ఎత్తైన బల్ల మీద ఎలా పడుకోగలడు? ఏది మనదో అది మన దగ్గరుంటుంది. ఏది యితరులదో అది వారి దగ్గర ఉంటుంది".

సాయిబాబావారు అంత ఎత్తుకు హఠాత్తుగా ఎక్కటం, అంత యిరుకులో పడుకోవటం అన్నది వారి ఆధ్యాత్మిక ప్రగతిని సూచిస్తున్నాయి. తన బరువును అంత తేలికైన, గుడ్డపీలికలు ఎలా మొయ్యగలిగాయి? ఆయన లఘిమ అనే సిద్ధి చూపించారనుకోవాలి అక్కడ. వారు అత్యున్నత స్థానంలోకి కనురెప్పపాటు కాలంలో వెళ్లేవారు. సాయి మొదట పిచ్చి ఫకీరులా తోచేవారందరికీ. కొన్నాళ్లకు మంచి వైద్యుడనుకొన్నారు. అంతలో స్వయంగా దైవమేననుకొన్నారు. ఈ స్థాయికి ఎలా చేరారు! అర్థంకాని వాళ్లు ఆయనను నిందించటం, హేళన చెయ్యటం చేసారు. ఒంటి మీద ఉన్నది కఫినీ, తిన్నది భిక్షాన్నం, నివాసం పాడుబడ్డ మసీదు, బల్ల మీద చుట్టూ దీపాలు - ఇన్ని యిరుకుల మధ్యలో ఆయన ప్రశాంతంగా





పడుకొన్నారు. యోగీశ్వరులైనవారు తమకు ఐహిక బాధలెన్ని ఉన్నా పట్టించుకోరు. పరిసరాలకు ఒదిగిపోయి నిర్లిప్తంగా, నిశ్చింతగా ఉండ గలుగుతారు. నిందలను, పొగడ్తలను లెక్కచేయరు. అచ్చమైన గురువులు తమ సిద్ధులతో జనాన్ని ఆకట్టుకోవాలనుకోరు. బాబా మీద, ఆయన తత్త్వం మీద శ్రద్ధతోగాక-యీ చిత్రం మీద మోజుతో జనం ఎగబడటం సరైన పద్ధతి కాదు-సద్గురువులు దానిని ప్రోత్సహించరు. ప్రజల దృష్టి దాని మీద పడిందనగానే బాబా బల్ల విరక్కొట్టటం అందుకే.

మహల్సాపతి అంత ఎత్తుకు ఎక్కలేకపోవడానికి కారణం బాబా వారు వివరించారు. నామం వింటూ ఉండమంటే మధ్యలో నిద్రపోతాడు మహల్సాపతి. సమతలంగా ఉన్న నేల మీదనే కదలకుండా పడుకోలేనివాడు ఎంతో ఎత్తుకు ఎగిరి ఎలా పడుకోగలడు? అంటే పదిమందీ మామూలుగా విజయం పొందే విషయంలోనే విజయం సాధించలేని వాడు-అనేకానేక విఘ్నాలను ఎదుర్కోవలసిన ఆధ్యాత్మిక రంగంలో ఎలా రాణించగలడు? దీనికెంతో స్థితప్రజ్ఞత్వం, దీక్ష అవసరం గదా! అదీగాక - నిద్ర - ముఖ్యంగా అతి నిద్ర అన్నది తామస లక్షణం. ఇది అలసత్వానికీ, అలక్ష్యానికి గుర్తు. ఏదైనా సాధించదలచి తీవ్రప్రయత్నం చేసేవాడు నిద్రకు దూరమవుతాడు సహజంగానే. లక్ష్మణుడు వనవాసకాలంలో పధ్నాలుగేళ్లూ నిర్నిద్రంగానే ఉన్నాడు. గోగ్రహణ సందర్భంలో ఉత్తరకుమారునికి భీష్మాచార్యుల వారి నిర్నిద్రతను గూర్చి బృహన్నల చెప్పిన సందర్భం గుర్తు చేసుకోవాలిక్కడ. ఆ నిర్నిద్రత గొప్ప తపస్సాధన. భగవద్ధ్యానం, నామ సంకీర్తనం-యివి భక్తునికి మహదానందాన్నిస్తాయి. ఈ ఆనందాన్ని ఆస్వాదిస్తుండగా నిద్రెలా వచ్చింది మహల్సాపతికి? అంటే ఆయన సాధన పరిపక్వం కాలేదన్నమాట!

ఉన్నతస్థాయికి చేరుకోవాలంటే సాధకుడు కళ్లు తెరిచే నిద్ర పోతుండాలి- అన్నారు బాబా. అంటే అర్థం - కళ్లతో ఐహిక విషయాలను చూస్తున్నా మనసు నిర్లిప్తంగా ఉండాలి, వాటి మీద వ్యామోహం కలగ నీయరాదు అని. ఒక ముస్లిం యువతి సౌందర్యానికి నానాసాహెబ్ చందోర్కర్ ఆకర్షితుడై చూస్తూ - సాయిబాబా హెచ్చరించగానే సిగ్గుపడి నపుడు సాయి చెప్పింది యిదే - "ఇంద్రియాలు విషయాల వెంట పరుగు

పెట్టనీ - నీ మనసును మాత్రం వాటితోపాటు పరుగెత్తనీయకు. బుద్ధితో మనసుకు పగ్గాలు వేయి". నిత్య జాగరూకత అనేది సాధకునికి ఉండ వలసిన ముఖ్యలక్షణాలలో ఒకటని శాస్త్రాలు చెప్తూనే ఉంటాయి గదా! అంత జాగరూకుడు కాని వాడికి ఆ బల్ల పనికిరాదంటారు సాయి. ఆ తరువాత బాబా అన్న మాట చాలా గొప్పది. "నీ యోగ్యతకు తగిన వస్తువేదో భగవంతుడు నీకిస్తాడు. అది నీకు దక్కుతుంది. ఇతరుల యోగ్యతను బట్టి వారికి తగిన వస్తువేదో వారికి దక్కుతుంది". అంటే మనం ఉన్నత స్థాయికి వెళ్లాలంటే దైవం ఊరికే యివ్వడు. నీవు సాధన చెయ్యాలి. నీ సాధన లేనిదే దైవం కూడా యివ్వడు. ఇలా శ్రీ సాయినాథుల వారు చిన్న మాటలలో ఎంతో అద్భుతమైన అర్థం యిమిడ్చి బోధించారు.

## ధ్యానమందిరం అంటే ...

**- శ్రీశ్రీశ్రీ సత్యానంద మహర్షుల వారు**

ఈ మందిరం కేవలం భగవద్ధ్యానమునకే నిర్ణయింపబడినది. ఇచట భజన, అభిషేకము, పూజ, ప్రార్థన, జపము, ధ్యానము, హారతులు మొదలగు ఆధ్యాత్మికానుష్ఠానములు తప్ప ఇతర విషయములెవ్వియు మాట్లాడరాదు. అసలిచటనున్నంతకాలము ప్రతివాడును భక్తితన్మయుడైయుండవలెను. ఒకరు మాట్లాడిన నితరులును మాట్లాడుదురు. అందువలన నియమ భంగము, శాంతిభంగము కలుగును. అత్యవసర విషయములు మాట్లాడ వలసి వచ్చిన తానెవ్వరితో మాటలాడదలచునో వారిని చేసంజ్ఞలతో మందిరమునకు దూరముగ తీసుకొని వెళ్లి మాట్లాడవలయును. అదిగాక ఒకరు మాట్లాడిన మిగిలిన వారి దృష్టి భగవంతునిపైనుండి మాటలపైకి, వ్యక్తుల పైకి మరలును. అందువలన నెవ్వరును ఎట్టి విషయములను మందిరములో సంభాషించకూడదు. అప్పడు మందిరములో ప్రశాంత, గంభీర, ఆధ్యాత్మిక వాతావరణము నిండియుండును. అచట సాధకులు నిశ్శబ్దముగా ధ్యానము చేసుకొనుచుందురు. ఆశ్రమములన్నిటిలో ఈ నియమము పాలింపబడుచున్నది. పాటింపబడవలెను.





### స్వరాంజలి

## ఆడిస్తు ఉన్నావా!

**- కోట ప్రకాశం (కృష్ణబాబు)**

ఆడిస్తూ ఉన్నావా గురువా,
నన్ను - ఆడిస్తు ఉన్నావా గురుడా!
తెరపైన నన్నుంచి తెరమరుగునే చేరి
పగ్గాలు చేపట్టి బొమ్మగా ననుజేసి ॥ ఆడిస్తు ॥
సంసారి కాకుండ మోక్షమేలేదంచు
బొమ్మకే మరుబొమ్మ జతచేసినావయ్యా
వంశాభివృద్ధికై సంతునే సమకూర్చి
సంసారపుటూబిలో కదలకే నన్నుంచి ॥ ఆడిస్తు ॥
బుద్ధి నొకటిచ్చావు మనసొక్కటిచ్చావు,
మధ్యలో మాయలే అధికమే చేసావు
తేనెలో యీదేటి ఈగనే ననుజేసి
చిరునవ్వు చిందించు మోముతో ననుజూస్తు. ॥ ఆడిస్తు ॥

## కన్నానులే కన్నయ్యను

**- శ్రీమతి కుసుమకుమారి**

కన్నానులే కన్నయ్యను-కనులార నే ॥ కన్నాను ॥
మురళిధరుని రూపాన ముద్దులొలుకుచున్నాడు
వెన్నముద్దలకు తాను వేగిరపడుచున్నాడు ॥ కన్నాను ॥
వేణుగానలోలుడు వేదాంత బోధకారుడు
గీతబోధ చేసినాడు జ్ఞానమార్గమందు నడువ
కన్నానులే కన్నయ్యను కనులారనే
కన్నానులే కన్నయ్యను కనులారనే ॥ కన్నాను ॥

# మా గురుకృప

- శశిధర శర్మ


ఈ మధ్య నాకు గురుదేవులు చేసిన ఒక మేలు గురించి చెప్పదలచు కున్నాను. మా అమ్మమ్మగారికి ఈనెల డిసెంబరు 15వ తేదీ రోజు రాత్రి 1.30కి గుండెనొప్పి రావడంతో హాస్పిటల్‌కి తీసుకువెళ్ళడం జరిగింది. గురువుగారి ఆదేశానుసారం ఇంట్లో అందరం ఎల్లపుడు ఊది వాడుతాం, ఆ రోజు కూడ అమ్మమ్మగారికి ఊదిపెట్టి హాస్పిటల్‌కి తీసుకువెళ్ళాం. బాబా దయ వల్ల 3.30కి తిరిగి ఇంటికి తీసుకువచ్చాం; కాని తనకు గుండెపోటు వచ్చిన విషయం గమనించి ఆయాసపడటం చూచి మళ్ళీ కంగారుగా హాస్పిటల్‌కు వెళ్ళాం. అప్పడే కార్డియాలజిస్ట్ వచ్చాడని విజయా ఆసుపత్రి నుంచి ఫోను వచ్చింది. డాక్టరు చూచి వెనువెంటనే తాను పనిచేసే సిగ్మా ఆసుపత్రికి తీసుకువచ్చి చేర్చమని చెప్పినారు. వెంటనే గురువుగారికి యీ విషయం తెలియజేసి చేర్చాము. అక్కడ రెండు రోజులు ఉంచి అంజియోగ్రామ్ చేసి స్టెంట్ వేసి పంపినారు. ఇంటికి తీసుకువచ్చిన తరువాత రెండు రోజులు బాగానే ఉంది. మరునాడు విపరీతమైన ఆయాసంతో బాధపడుతుంటే మళ్ళీ ఆసుపత్రికి తీసుకువెళ్ళాము. ఈసారి కిమ్స్ ఆసుపత్రికి తీసుకువెళ్ళాం. మళ్ళీ ఈ విషయం గురువు గారికి తెలియజేసినాము. కాని ఈసారి గురువుగారు పరిస్థితి బాగాలేదని బాబాను నమ్ముకొమ్మని చెప్పినారు. డాక్టర్లు పరీక్షించి పరిస్థితి బాగాలేదని బ్రతకడం చాలా కష్టం అని చెప్పినారు. గురువుగారు చెప్పినట్లు బాబాపై భారం వేసి కూర్చున్నాం. రెండోరోజు ఆయాసం పెరిగింది. ఆ రోజు గురువుగారు, మాతాజీగారు, రాముగారు ఊరికి బయల్దేరినారు; గురువుగారు ఊళ్ళో లేనప్పడు నాకు చాలా శక్తిహీనంగా ఉంటుంది; అమ్మమ్మగారిని ఐసిసియు లోకి మార్చారు. ఇంకో అరగంట బ్రతికినా





ఎక్కువేనన్నారు. వెంటనే రాము గారికి మెసేజ్ చేయడం జరిగింది; వారు గురువుగారితో విషయం చెప్పి ఫోన్‌లో మాట్లాడించినారు; గురువుగారు పరిస్థితి బాగాలేదని బాబాను నమ్ముకొమ్మని చెప్పినారు; ఏ పరిస్థితినైన ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండమని నాతో అన్నారు; నాకు చాలా కంగారుగా ఉంది. గురువుగారిని చాలా వేడుకున్నాను; వారు నాపై దయతలచి "సరే, బాబాను ప్రార్థించు, ఊదీ పెట్టి నామజపం చేస్తూ ఉండు అన్నీ బాబా చూసుకుంటారు కంగారుపడకు" అని చెప్పినారు. నేను వెంటనే ఐసిసియులోకి వెళ్ళి అమ్మగారికి ఊదీపెట్టి నామం చెవిలో చెప్పి, బయటకు వచ్చి, ఆగకుండా నామజపం చేస్తూ కూర్చున్నాను. రెండు గంటల తర్వాత డాక్టరుగారు ఫరవాలేదు అని చెప్పారు. ప్రతిక్షణం కొద్దికొద్దిగా ఆయాసం తగ్గడం జరుగుతున్నది. బాబా దయ వల్ల రెండు రోజుల తర్వాత ఐ.సి.యు నుంచి రూముకు మార్చారు. అక్కడ రెండు రోజులుంచి ఇంటికి పంపారు. ఇప్పటి పరిస్థితి ఫరవాలేదు. కేవలం గురువుగారి ఆశీర్వచనం వల్ల, బాబా దయవల్ల అమ్మమ్మగారు బతికినారు. ఆశ్రమానికి వెళ్ళి గురువుగారికి ధన్యవాదాలు తెలిపి వచ్చినాను. అప్పడు గురువుగారు ఏమీ భయపడకు, బాబాగారు తోడుగా ఉన్నారు, ఆయన్ని నమ్ముకో అన్నీ చూసుకుంటారు" అని ధైర్యం చెప్పినారు. అమ్మమ్మగారిని ఇంకా కొన్ని రోజులు బ్రతికించమని గురువుగారిని వేడుకున్నాను. గురువుగారు తథాస్తు అన్నారు; ఇప్పడు అమ్మమ్మగారు బ్రతికే ప్రతి క్షణం కూడా బాబాగారి ప్రసాదం, గురువుగారి ప్రసాదమే. అమ్మమ్మగారి గురించి బాబాను, గురువుగారిని ధ్యానించినప్పడు గురువుగారు, బాబాగారు అమ్మమ్మగారి తల దగ్గర కూర్చొని రక్షిస్తున్నట్లు అనిపిస్తుంది. అసలు మా అందరినీ నడిపిస్తుంది శ్రీశ్రీశ్రీ గురుదేవులు, బాబావారు. ఇది సత్యం. ఇదే మా నమ్మకం. ఇదే మా విశ్వాసం.

జై గురుదేవ, జై సాయిరామ్.



# కబీరు అమృతవాణి

సేకరణ : తిరుమలశెట్టి వేంకట సుబ్బారావు, కొవ్వాడ

కబీరు నోటి నుండి అమృతవాక్కులాల వెలువడిన దోహాలలో యిది ఒకటి.

దోహా॥ కేసన్ క్యాచియా రియా! జో మూండో సౌసౌ బార్
మన్ కో క్యోం నహి ముండియెరు జామె బిషై (విషమ) బికార్ (వికార్)!!

చాలామంది సాధు సన్యాసులు-తరచూ తలజుట్టు శుభ్రంగా తీయించి గుండు చేయించుకుని, తాము అహంకారరహితులము-విరాగులము అని చెప్పకుంటారు. కానీ పాపం! ఆ తలవెంట్రుకలు ఏమి పాపం చేసాయని తడవ తడవ వాటిని గుండు గీయించటం? మనసును ఎందుకు ప్రక్షాళన (గుండు గీయించరు?) చేసుకోరు! అసలు అదే అనేక ప్రాపంచిక విషయ వికారాలనే దృఢకేశాలతో నిండి ఉంటుంది.

ఊరక వేషమూ, గురు సాంప్రదాయపు పేరూ పెట్టుకోగానే సరిపోదు. ఆ సద్గురువు యొక్క వైరాగ్య భావాలనూ, నిష్పక్షపాత బుద్ధినీ-సర్వభూత కోటి యందు అపార ప్రేమ వాత్సల్యాలను, సర్వమానవ సౌభ్రాతృత్వ భావనలను, వారసత్వంగా, గురుప్రసాదంగా హృదయంలో పదిలపరచుకోవాలి. అది లేనపుడు ఆ గురు సాంప్రదాయపు పేరూ, కాషాయ వస్త్రాలధారణ, రుద్రాక్షమాలలు, తులసిపూసల మాలలు-కేవలం ఆ మనిషికి అలంకార ప్రాయం అవుతాయేగానీ, అవి మనిషిని ఆధ్యాత్మికంగా కొంచెం కూడా పైకి ఎదుగనివ్వవు.

ఏదో ఒక ఇష్టదైవాన్ని కొద్ది క్షణాలు నియమంగా ధ్యానించటం అన్నదే మోక్ష సాధనం.





# కలలో కరుణ

– మాతా శుకవాణి

"అమ్మా, అమ్మా, ఇదెంత ముద్దుగా ఉంది కదూ! దీనికి 'కరుణ' అని పేరు పెడదాం అమ్మా! నాకిష్టం ఆ పేరు" అన్నది చైత్ర.

సరేనంది అమ్మ. ఎక్కడినుంచీ వచ్చిందో ఆ బుజ్జి మేకపిల్ల. పెరట్లో దూరి దొండాకులూ, చింతమొక్కా, టొమేటో మొక్కలూ అన్నీ స్వాహా చేసేసింది. పెద్దన్నయ్య దాన్ని పట్టుకొని, కట్టేసాడు. అరుస్తోంటే ముందు కాసిన్ని ఆకులు పడేసి, నీళ్లు పెట్టాడు. "దాని వాళ్లెవరో వచ్చేదాకా యిదింతే. లేకపోతే మొత్తం తోటంతా మేసేస్తుంది. ఎవరూ విప్పకండి" అని ఆర్డరు వేసేసాడు.

"పాపం, కరుణ కనపడకపోతే వాళ్లమ్మ ఏడవదూ?" బొజ్జ ఊపుకుంటూ వచ్చి అన్నది సుధీర. "ఏడుస్తుంది, పాపం!" వంత పాడాడు మురళి. "ఏయ్ మీరందరూ లోపలికి వెళ్లండి" పెద్దన్నయ్య కసిరితేగానీ అక్కడి నుంచీ కదల్లేదు వాళ్లంతా. అన్నం తిని పడుకున్నది చైత్ర. మేకపిల్ల సన్నని గొంతుతో అరుస్తున్న మే, మే శబ్దాలు వింటూ వింటూ నిద్రలోకి జారుకొన్నది.

పిల్ల యిక్కడున్నదని ఎలా తెలిసిందో-పెద్ద మేక వచ్చేసింది. బిడ్డ దగ్గరకు వెళ్లి మూతితో దాని ముఖం రుద్దింది. కరుణ తల్లి పొదుగులో మూతిపెట్టి జుబుకు జుబుకుమంటూ పాలు తాగుతోంది. మేకమ్మ కదల కుండా అలాగే నిలబడింది అది పాలు తాగినంతసేపూ. తాగటం అయిపోయాక కరుణను విప్పి తీసుకువెళ్లడానికన్నట్లు చెట్టు చుట్టూ తిరిగింది. లాభం లేదనుకొన్నదో ఏమో మెల్లగా కరుణ పక్కనే నడుం వాల్చింది.

"అసలు మందలో ఉండకుండా ఎందుకు వచ్చావు ఒక్కదానివే!"

విసుక్కున్నది అమ్మ. "పిన్నిగారి అమ్మాయీ, నేనూ యిద్దరం వచ్చాం. అడుగో ఆ పెద్దన్నయ్య రావటం చూచి అది పారిపోయింది. నేనేమో చిక్కుకు పోయాను" అంది కరుణ. మళ్లీ అదే అన్నది- "అసలు నన్నెందుకు కట్టేసా రమ్మా! నేనేం తప్పచేశాను? "వాళ్లనే అడగకపోయావూ!" "అడిగాను. కానీ మన మేమే భాషకు వాళ్లకు రాదనుకొంటా. ఏమీ చెప్పలేదు" అంది కరుణ.

"నువ్వు వాళ్ల తోటలో మొక్కలు తిన్నావుగా! అందుకని" అంది అమ్మ.

"మనం ఆకులు తినొచ్చని చెప్పావు. కొన్నిరకాల ఆకులు తినకూడదని చెప్పావు. అంతేకానీ ఎక్కడ తినొచ్చో, ఎక్కడ తినకూడదో చెప్పలేదుగా!" కరుణ అలకగా అంది.

"పెద్ద వాళ్ల వెంటనే ఉండి చూచి నేర్చుకోవాలి. అంతేగానీ అన్నీ చెప్పాలా?" అమ్మ విసుక్కున్నది.

"మేము తింటే వాళ్లకు చాలవని పట్టుకున్నారా?"

"వాళ్లు అసలు ఆకులు తినరు. కాయలూ, పళ్లూ తింటారు. కొద్దిరకాల ఆకులు మాత్రం కూరవండుకుంటారు."

"మరైతే మనం తింటే వాళ్లకేం?"

"ఆకులు తినేస్తే పూలూ, కాయలూ ఉండవు. మొత్తం చచ్చిపోతాయి".

"మరి, మనకు మొక్కలు పెంచుకోవటం రాదుగా! ఎలాగ? వాళ్లే కొన్ని పెంచి మనకివ్వవచ్చు గదా! అవునూ, మీ చిన్నప్పడు మిమ్మల్నిలా పట్టుకొంటే మీరేం చేసేవారు?"

"అప్పడు ఇంత అన్యాయంగా లేదు ప్రపంచం. పశువులు, మనం- అంటే మేకలు, గొర్రెలు యిలాంటి వాటికోసం ప్రతి ఊళ్లోనూ పచ్చిక బయళ్లు వదిలేసేవాళ్లు. అక్కడక్కడా అడవులుండేవి. తెలిసీ తెలియకా ఎవరి తోటలైనా పాడుచేసినా "నోరులేని జీవులను కొట్టగూడద"ని కొట్టేవారు కాదు- బయటికి తోలేసేవాళ్లంతే".

"మరి ఇప్పడెందుకు లేవు అడవులూ అవీ?"

"మనుషులు కొట్టి పారేస్తారమ్మా! పొయ్యిలో కట్టెలకీ, ఇళ్లు కట్టుకోవ





డానికీ, ఫ్యాక్టరీలు కట్టడానికీ, కుర్చీలు, బల్లల లాంటివి చేసుకోవడానికీ, పుస్తకాలు, పెన్సిళ్లు, మందులు-ప్రతి దానికీ వాళ్లక్కూడా చెట్లు కావాలి. అందుకే కొట్టేస్తారు".

"మరి అన్ని చెట్లూ అయిపోతేనో!"

"ఏడుస్తూ కూర్చుంటారు. ఇప్పడు జరుగుతున్నది అదే. చెట్లు లేకపోతే వానలుండవు. సక్రమంగా వానలు లేక, పంటలు సరిగ్గా పండక తిండి చాలదు. వాతావరణంలో వేడి బాగా పెరిగిపోయి నానా రోగాలూ వస్తాయి. నేల కోసుకుపోతుంది. కొండలు కూలిపోతాయి. అందుకే ఒక చెట్టు కొట్టేముందు రెండు మొక్కలు పెంచి తీరాలి".

"మరి యివన్నీ వాళ్లకు తెలియవా?"

"తెలుసు. మనిషి బోలెడన్ని తెలివితేటలున్న మూర్ఖుడు, స్వార్థపరుడు. ఇవ్వేళ్టి సంగతే చూచుకొంటున్నాడు. రాబోయే పిల్లల తరాల గురించి చూచుకోవటం లేదు. ఇద్దరు, ముగ్గురు మనుషులుండటానికి పెద్ద పేద్ద భవనాలు కట్టుకొంటాడు. అవసరం ఉన్నా లేకున్నా బోలెడంత ఫర్నీచర్ అంటారు వాళ్లు - కలప సామాను చేయించుకొంటాడు. పిల్లలు చించి పారేసే కాగితాలు, విందులు వినోదాల పేరిట వృథా చేసే అన్నం, కూరలు - ఛీ తలుచుకొంటేనే చికాకువేస్తుంది మనుషుల చేష్టలు. క్రూరులవు తున్నారు రోజురోజుకీ.

"అవునమ్మా, మొన్న గోవిందుగారి మందలో నా కన్నా పెద్దది....ఊఁ! నీ అంత ఉంటుందిలే-ఒక మచ్చల మేక ఉంది చూడు-దాని కాలికేదో దెబ్బతగిలి మందతో గబగబా నడవలేక వెనకబడిపోయిందట. అక్కడ కొండల్లో వాళ్లెవరో పట్టుకొని కోసుకు తినేసారట!"

"మనమే నయం కరుణా! కడుపు నిండితే యిక తిండి జోలికిపోము. బాగా తినేసి కూడా మనిషి రేపటి కోసం, పై ఏటి కోసం అంటూ దాచు కొంటాడు. అమ్ముకొని డబ్బు చేసుకుంటాడు. ఛీ!"

“వీళ్లు పాపం, మంచి వాళ్లేనమ్మా! నన్నేమీ కొట్టలేదు. ఆకులు పెట్టారు కూడా”.

“అవునమ్మా! దుర్మార్గుల చేతుల్లో పడితే ఏమైపోయేదానివో!” మేకమ్మ ఏడ్చింది. చైత్రకు కూడా ఏడుపొచ్చింది. అంతలోనే మెలకువ వచ్చేసింది. చూస్తే తెల్లారిపోయింది. అప్పటికే సుధీరా, మురళీ కరుణ దగ్గర చేరిపోయారు.

“వాళ్లమ్మేదీ?” చైత్ర అడిగింది.

“ఇక్కడికి రాలేదుగా!” అన్నాడు మురళి.

“వచ్చిందిరా! బోలెడంతసేపు మాట్లాడింది కూడా”.

“సర్లే, పోమ్మా! మళ్లీ నిద్రపో-కన్పిస్తుంది” సుధీర వెక్కిరించింది. అంతలో పెద్దన్నయ్య వచ్చాడు. చైత్ర వాడి వెంటపడింది. “అన్నయ్యా, కరుణను వదిలెయ్యరా పాపం! వాళ్లమ్మ ఏడ్చిందిరా!” అని బ్రతిమిలాడింది. అన్నయ్య నవ్వి, “అదుగో, మేకలాయన వచ్చాడుగా! తోలుకు వెళ్లమన్నాలే!” అన్నాడు. వెళ్లిపోతున్న కరుణవైపు అభిమానంగా చూస్తూ నిలబడింది చైత్ర.

ఇప్పుడు చైత్ర మునుపటిలాగా అన్నం కంచం చుట్టూ పారెయ్యదు. రోజూ మొదటిముద్ద బయట చెట్టు క్రింద పెట్టి వస్తుంది పక్షులకని. నోట్సులో కాగితాలు ఊరికే చింపి పారెయ్యదు. “అవును-మనం ఎక్కువ కాగితాలు పారేస్తే, మళ్లీ యింకా ఎక్కువ నోట్సులు తయారుచెయ్యాలి. అందుకు చెట్లు కొట్టెయ్యాలి. అప్పుడు వానలుండవు, పంటలు పండవు, మన బొజ్జలు నిండవు. అందుకే చింపకండి” అని మిగిలిన వాళ్లక్కూడా చెప్తుంది. “మనం వ్రాసుకొనే పెన్సిలు, చెరిపే రబ్బరు, పుస్తకాలు పెట్టుకొనే సంచి, కూర్చొనే బల్ల, పీల్చే మంచిగాలి- ప్రతిదీ చెట్టు తల్లి ఇచ్చేదే. అందుకని రోజూ మనం మొక్కలకు నీళ్లు పోసి పెంచాలి”- అంటూ ఓ చిన్నారి తోట కూడా పెంచటం మొదలుపెట్టింది చైత్ర, తమ్ముడూ, చెల్లి సాయంతో. ఆ తోట పేరు “కరుణవనం” అని పెట్టింది.





# గ్రంథ స్వీకారం

శ్రీ ఆలూరి గోపాలరావుగారు గుంటూరు జిల్లా పొన్నూరు కేంద్ర స్థానంగా పరిసరాలంతటా శ్రీ సాయిబాబా తత్త్వాన్ని ప్రచారం చేయటంలో గత మూడు దశాబ్దాలకు పైగా కృషి చేస్తున్నారు. వారు చిన్నపిల్లల కోసం, స్త్రీలలో బాబాతత్త్వ వ్యాప్తి కోసం కూడా అవిశ్రాంతంగా పనిచేస్తున్నారు. వారు ఇటీవల “శ్రీ సాయిబాబా సమగ్ర చరిత్ర” వెలువరించారు. మూల చరిత్రకు భిన్నంకాని రీతిలో, అనేకానేకమంది అలనాటి భక్తులు బాబా వలన పొందిన ఆధ్యాత్మిక లబ్ధిని, లౌకిక ప్రయోజనాలను, శ్రీ సాయి బోధనలను చక్కగా కలుపుకొంటూ సరళశైలిలో వారు రచించిన యీ గ్రంథం భక్తులు చదవదగినది. చివర షిరిడీలో చూడదగిన స్థలాల వివరాలు చిత్రపటాలతో సహా యిచ్చారు. అంతేకాక శ్రీసాయి మందిరం, షిరిడీలోని ముఖ్యప్రదేశాలు, ద్వారకామాయి, చావడి, ప్రముఖ భక్తులు, సాయి వాడిన వస్తువులు వగైరాల వర్ణచిత్రాలు చక్కగా పొందుపరిచారు గోపాలరావుగారు. గెటప్, బైండింగ్ అందంగా ఉన్నాయి. 624 పేజీల యీ గ్రంథం వెల రూ.250/-. ఈ గ్రంథాలు లభించే చోటు -

**శ్రీ ఆలూరి గోపాలరావు, 1-4-38, 4వ అడ్డ రోడ్డు,**

**పొన్నూరు, గుంటూరు జిల్లా. ఫోన్ : 9948780696**

---

శ్రీ ఎం.పి. సాయినాధ్‌గారు అశేషమైన శ్రీ సాయిసాహిత్యాన్ని అధ్యయనం చేయటంలోను, ఎన్నెన్నో విషయాలు భక్తులకు అనేక పత్రికల ద్వారా, తమ విడి రచనల ద్వారా అందించటంలోను సుప్రసిద్ధులు. సౌమనస్యం, స్థిరభక్తి కలబోసిన వ్యక్తి సాయినాధ్‌గారు. ఇటీవల వారు శ్రీ సాయి సచ్చరిత్రలో బాబావారు చేయించిన వివాహాలు-కుదిర్చిన సంబంధాలు-కుటుంబ విషయాలలో వారిచ్చిన సలహాలు-ఆలుమగలు జీవించవలసిన రీతులను గూర్చి చెప్పిన విషయాలు వగైరాలన్నింటినీ గుదిగ్రుచ్చి “కళ్యాణ సాయి” అనే పేరుతో చక్కని చిన్న గ్రంథం రచించారు. సరళంగా, సూటిగా సాగిన యీ రచన సాయిభక్తులకు కొన్ని క్రొత్త విషయాలను కూడా అందిస్తుంది. దీనిని **శ్రీ షిరిడి సాయిబాబా మందిరం, కొవ్వాడ, గంగనాపల్లి పోస్ట్, వయా ఇంద్రపాలెం, కాకినాడ** వారు ప్రచురించారు. ముచ్చటగా అచ్చువేసిన యీ గ్రంథం ప్రతులకు అదే చిరునామా.

**వారి ఫోన్స్ : 9490479686, 0884-2371196**

# శ్రీ సాయి-సేవ

## శ్రీసాయి సేవ అవసరమా?

**– సాయివాణీ ప్రచురణలు**

**(గత సంచిక తరువాయి)**

సేవ చేద్దామనుకోవడానికీ, నిజంగా చేయడానికీ మధ్య అంత అంతరం ఉంది. సేవకుడికి తానెవరు, ఏ పొజిషన్‌లో ఉన్నాడు, చేస్తే ఏమవుతుంది - ఈ ఆలోచనలన్నీ వస్తే అతనెన్నటికీ సరైన సేవకుడు కాలేడు గాక కాలేడు. స్పాంటేనియస్‌గా అలా దూకి రావాలి సేవాభావం.

మనలో చాలామందికి ఏదైనా చేయాలని ఉంటుంది. ఏం చెయ్యాలో తోచదు. కొన్ని రంగాలు చూచినా 'ఇది కాదు, ఇది కాదు' అనుకొంటాం. ఏది కావాలో తెలియదు. అసలు సేవ చేయదలచినవాడు దేన్నైనా సమర్థవంతంగా చేసే ప్రయత్నం చేస్తాడు. లోటుపాట్లుంటే దిద్దుకుంటాడు. 'చేస్తే బాగుండును' అనుకొనేవాడు మాత్రమే యిలా తటాపటాయింపులో ఉంటాడు.

శ్రీ కృష్ణుడు మహాయుద్ధంలో ఓ గొప్ప ధానుష్కుడైన అర్జునుడికి సారథ్యం నెరిపాడు. ఏ రాత్రికా రాత్రి యుద్ధం అయిపోగానే గుర్రాలను మాలిష్ చేసి కడిగి మేతా పెట్టాడు. మయసభలో రాజసూయయాగ సందర్భంలో ప్రథమ తాంబూలమూ అందుకొన్నాడు, అదే యజ్ఞానికి వచ్చిన రాజుల పాదరక్షలన్నీ క్రమంలో పెట్టే పనీ చేసాడు.

శ్రీ రమణ మహర్షి మౌనంతోనే దివ్య సందేశాలు అందించారు. మట్టి పిసికి ఇల్లు కట్టారు. వంటింట్లో పచ్చడి రుబ్బారు. మా గురుదేవులు కేవలం బోధలు చెయ్యటమే కాదు - ఆవులకు మేత వేస్తారు, గది ఊడ్చుకొంటారు- ఎవరూ అందుబాటులో లేకుంటే ఆశ్రమంలోని అనాథశిశువులు మల విసర్జన చేస్తే శుభ్రం చేస్తారు కూడా.





"వాళ్లంతా మహానుభావులు. వాళ్లెక్కడ! మనమెక్కడ?" అంటారు కొందరు. మరి మనం కూడా వాళ్ల అడుగుజాడల్లో నడవాలి గదా! ఇక్కడ ఇంకో విషయం ఉంది. చేస్తున్నది మనమే అయితే మనం ఏరుకోవాలి రంగాన్ని. చేయించేవాడు వేరే ఉన్నప్పుడు మనకెందుకు ఆ చింత? ఎటొచ్చీ భేషజాలు, కుల గోత్ర వివక్ష, ప్రెస్టేజీ గొడవలు ఏమైనా అడ్డుపడుతుంటే చెప్పలేం గానీ - ఒక్క నిమిషం ఆలోచిస్తే "నిజంగా మనమే చేస్తున్నామా?" అన్నది స్పష్టంగా తెలుస్తుంది.

అందాకా ఎందుకు - మన పాత దేవాలయాలలో నాలుగు మూలలా స్తంభాల మీద యక్షుల బొమ్మలు పెట్టి ఉంటాయి.... పెద్ద పెద్ద బొజ్జలు అవీను. అవి రెండు చేతులూ పైకెత్తి ఆలయం పైకప్పు మోస్తున్నట్లుగా కన్పిస్తాయి. నిజంగా అవే మోస్తున్నాయా? పునాది, దాని మీద గోడలు, బీమ్స్ అన్నీ కలిసి మోస్తుంటే - యక్షులే మోస్తున్నట్లు భ్రమింపజేస్తున్నాయి. మనం కూడా అంతే.

ఎద్దు బండిని లాగుతున్నది. అది మెల్లగా నెమరువేస్తూ ఒకే పద్ధతిలో నడుస్తూ వెడుతున్నది. బండి చక్రం మాత్రం కిర్రుకిర్రుమని మోగుతోంది. ఎద్దు విసుగ్గా వెనక్కు తిరిగి యిలా అంది - "బండి లాగుతున్నది నేను, నేనేమో ఆనందంగానే ఉన్నాను. నువ్వెందుకు మూలుగుతూ ఆయాస పడుతున్నావు?" అలాగే అసలు బరువు పైవాడు మోస్తుంటే మనం ఆయాస పడుతుంటాం. అలా కాక "నడిపేవాడు తానుండగా నడవడానికి నాకేం వెరపు!" అనుకొంటే ఎలా ఉంటుంది? మనకు ఈ శక్తియుక్తులు, ఆరోగ్యం సమస్తం యిచ్చినవాడు ఆయనే అయినప్పుడు వివిధ రూపాలలో (జీవులలో) వెలుగుతున్న ఆయనను సేవించటానికి నాకేమి చింత? - యీ భావన మనలో ఉండాలి.

**(సశేషం)**



ఓం శ్రీ సాయిరాం

# షిరిడీ డైరీ

- మాన్యశ్రీ జి.ఎస్. కపర్దే

అనువాదం : మాతా శుకవాణి

(గత సంచిక తరువాయి)

12-12-1910

ఉదయం ప్రార్థనల తరువాత సాయి మహరాజ్ తన మామూలు నడకకు వెళ్ళిపోయాక, మేము కూర్చొని మామూలు గానే మాట్లాడుకొంటున్నాం. దీక్షిత్ పూర్తిగా తన విధానం మార్చుకున్నట్లు కన్పిస్తున్నాడు. చాలాసేపు ప్రార్థనలోనే గడుపు తున్నారు. సహజంగానే మెత్తని అతని స్వభావం మరింత మృదువుగా, ఏదో మాధుర్యం నింపుకున్నట్లు అనిపిస్తోంది. ఆంతర్యంలోని ప్రశాంతతే కారణం దీనికి. రావు బహద్దుర్ రాజారాంపంత్ దీక్షిత్ ఫూల్‌గావ్ నుంచీ వచ్చాడు. ఆయనకు నాగపూర్ విడిచిపెడుతున్నపుడు షిరిడీ రావాలని కోరికే లేదని చెప్పాడు. కానీ ఫూల్‌గావ్‌లో తనకు ఆ క్షణంలోనే హఠాత్తుగా యీ ప్రయాణం చెయ్యాలనిపించిందట. ఆయన్ని చూడటం నాకెంతో సంతోషం కలిగించింది. మేమందరం కలిసి సాయి దర్శనానికి వెళ్ళాము. నేను కొద్దిగా వెనకబడటంతో సాయి మహ రాజ్ చెప్పిన చాలా ఆసక్తికరమైన కథ ఒకటి వినలేకపోయాను. ఆయన చిట్టి చిట్టి నీతికథలు బోధిస్తారు. ఒకతనికి ఒక గుర్రం ఉంది-అందమైనది-తనకు చేతనైనదేదో చేస్తుంది- కానీ, స్వారికి పనికి రాదు. చుట్టుప్రక్కలంతా తిప్పి ఎంత శిక్షణ యిచ్చినా లాభం లేకపోయింది.





అప్పుడొక పండితుడు యజమానికి బోధ చేసాడు- 'అది ఎక్కడినుంచీ వచ్చిందో అక్కడికి తీసుకువెళ్లు' అని. యజమాని అలా చెయ్యగానే గుర్రం జీను వేస్తే సరిగా నిలిచింది. సరైన త్రోవకు వచ్చింది - పనిలో పడింది- ఈ కథలో చాలా కొంచెమే విన్నాను నేను. తరువాత సాయి నేనెప్పుడు వెడుతున్నానని అడిగారు. "మీ అంతట మీరు అనుమతి యిచ్చేవరకు నేను వెళ్లన"ని చెప్పాను. ఆయన "ఇవ్వేళ మధ్యాహ్నం భోజనా లయ్యాక వెళ్ళు" అని అనుమతించారు.

అటుపైన మాకు ప్రసాదంగా పెరుగు పంపించారు మాధవరావు దేశ్‌పాండే ద్వారా. అది నేను భోజనంతో తిని, వెంటనే సాయిసాహెబ్ దగ్గరికి వెళ్లాను - నాకిచ్చిన అనుమతిని పక్కా చేసుకోవడానికి. నేను వెళ్లగానే ఆయన సరే - వెళ్లమన్నారు. మా అబ్బాయికి నమ్మకం చాలక మళ్లీ అడిగితే స్పష్టంగా చెప్పారు వెళ్లమని. సాయి మహరాజ్ వేరే వాళ్లందరినీ దక్షిణ అడిగి తీసుకున్నారు - నన్నూ, మా అబ్బాయినీ తప్ప. నా దగ్గర డబ్బు లేదు అంతగా. అది సాయికి తెలిసే ఉంటుంది. నూల్కర్‌కి, దీక్షిత్‌కి, బాపూ సాహెబ్ జోగ్‌కి, బాబా సాహెబ్ సహస్రబుద్ధే, మాధవరావు దేశ్‌పాండే, బాలాసాహెబ్ భాటే, వాసుదేవరావు ఇంకా యితరు లందరికీ వీడ్కోలు చెప్పి ప్రయాణమయ్యాము. పట్వర్ధన్, ప్రధాన్, కాకా మహాజని, తర్ఖడ్, ఇవ్వేళే వచ్చిన భిదేతోసహా అందరం కలిసి వెళ్లి సుమారు సాయంత్రం ఆరున్నర గంటలకు కోపర్గావ్‌లో రైలెక్కి మన్మాడ్ వెళ్లాము. భిదే యావలాలో దిగిపోయాడు. నేను, మా అబ్బాయి మన్మాడ్‌లో పంజాబ్ మెయిల్ ఎక్కేసాము.

(సశేషం)

# నేర్చుకోండి

– స్వామి వివేకానంద

## (కంఠస్థం చేయండి – మాతాజీ)

ఇతరులను అనుకరించడానికి ఆతురత చెందకండి. అనుకరణ నాగరికత లక్షణం కాదు. ఇది మనం గుర్తుంచుకోవలసిన ఒక ముఖ్య విషయం. నన్ను నేను ఒక మహారాజు వేషంలో అలంకరించుకోవచ్చు. అంతమాత్రం చేత నేనో రాజునవుతానా? సింహం తోలు కప్పుకొన్నంత మాత్రాన గాడిద సింహం అవుతుందా? అనుకరణ – పిరికి పందల అనుకరణ- అభివృద్ధికెన్నడూ దారితీయదు" అది మనిషి పతనానికి ప్రథమ సూచిక

ఒక మనిషి తనను తాను అసహ్యించుకోవడం ప్రారంభించాడంటే- అది అతని అస్తమయానికి ముగింపు దెబ్బ అవుతుంది. ఇక అతను తన పూర్వులను చూచి సిగ్గుపడుతున్నాడంటే పతనం దాపురించినట్లే. ఇక్కడ మీ ఎదుట ఉన్న నేను – హైందవజాతిలో కేవలం ఒక అల్పమాత్రుణ్ణి అయినప్పటికీ – నా జాతి పట్ల, నా పూర్వీకుల పట్ల నేను ఎంతో గర్విస్తున్నాను. మరెక్కడా సాటిలేని విధంగా ప్రపంచంలో ఘనతకెక్కిన మహిమాన్వితమైన ఋషి పరంపరకు, సాధుపుంగవులకు వారసులైన మీలో ఒకడిగా యీ దేశస్థుడనని చెప్పకోవడానికి నేను మిక్కిలిగా గర్వపడతాను.

అందుచేత మీపై నమ్మకాన్ని కలిగి ఉండండి. మీ పూర్వీకుల వారసులుగా గర్వపడండి. ఎవరినీ అనుకరించవద్దు సుమా! ఒకరి అడుగుజాడల్లోనే మీరు నడిస్తే మీ అస్తిత్వాన్ని కోల్పోతారు. ఆఖరికి పారమార్థిక వర్తనలో కూడా మీరు ఇతరుల ఆజ్ఞలకు లోబడి మసలుకోవలసిన దుస్థితి గనుక ఏర్పడిందంటే మీ గ్రహణశక్తిని, వివేచనా సామర్థ్యాన్ని





క్రమంగా కోల్పోయే మాట తథ్యం.

స్వయంకృషితో మీ అస్తిత్వాన్ని తట్టిలేపండి. దానితోపాటు పరుల దగ్గర ఏమైనా నేర్చుకోవలసినవి ఉంటే అవి కూడా కొంత గ్రహించండి. నిజానికి ఇతరుల నుంచి మనం నేర్చవలసిన విషయాలు చాలానే ఉన్నాయి. నేర్చుకోవడానికి నిరాకరించేవాడు మృతుడితో సమానం.

మీరొక విత్తనం భూమిలో నాటారు. అవి మొలకెత్తడానికి కావలసినంత సమృద్ధిగా మన్ను, ఎరువు, గాలి, నీరు అన్నీ సమకూర్చి పెట్టారు. వృద్ధి క్రమంలో అది మట్టిగా మారుతుందా? గాలిలా మారుతుందా? నీరుగా రూపొందుతుందా? వీటిలో ఏదీ కాదు. తనకు అందించబడిన వనరులను అందుకొని, తన స్వీయ ప్రకృతి నియమాన్ని అనుసరించి అది ఒక మహావృక్షంగా ఎదుగుతుంది. మీరు కూడా అలాంటి స్థితిలోనే ఉండాలి. నేర్చుకోండి. కానీ, జాగ్రత్త – అనుకరించకండి.

# బంధము-ముక్తి

– కృష్ణమోహనరావు.ఎ.

భావమే బంధం; అభావమే ముక్తి. నిజానికి మనల్ని గురించి ఆలోచించడానికి ఏమీ ఉండదు. ధ్యానంలో జరిగేది ఆలోచన లేకపోవటమే. మనం ఆలోచించేది ఎప్పుడూ మనకన్నా అన్యమైన ప్రాపంచిక విషయాల గురించే. అదే బంధాన్ని కల్గిస్తుంది.

ముక్తి ఏదో పొందే వస్తువు కాదు. ముక్తి ఏ విషయ సంబంధమైన ఆలోచనా కూడా లేని మానసిక స్థితి. ముక్తికి ప్రయత్నమక్కరలేదు. పట్టుకున్న వాటిని వదులుకోడానికే కావాలి ప్రయత్నం.

శబ్దమే ఆలోచన, బంధం. నిశ్శబ్దం ఆలోచనారహితం, ముక్తి. ముక్తిని

కోరేవాడు నిశ్శబ్దాన్ని అనుసరిస్తాడు. శబ్దాన్ని పట్టుకొన్నవాడు ముక్తికి దూర మవుతాడు. వేదానికి శబ్దమన్నమాట కూడా ఉంది. వేదాలను పట్టుకొన్నా ముక్తి రాదు. ముక్తిని గురించిన కోరికయే ఉండరాదు. ఎందుకంటే కోరిక ప్రపంచానికి సంబంధించినది. కోరికలో త్రిపుటి ఉంది. నేను-అన్య పదార్థం - యీ రెంటి సంబంధం. ఏ కోరికాలేని స్థితే ముక్తి. అందువల్ల ముక్తి కావాలి అన్న కోరిక మాత్రము ముక్తినివ్వదు.

కోరికలు, జ్ఞాపకాలు, సంస్కారాలు-వీటి నుండి దూరమైన జీవుడే ముక్తుడు. ముక్తి సాధన వల్ల రాదు. సాధనవల్ల కోరికలు, జ్ఞాపకాలు, వాసనలు తొలిగే అవకాశముంది.

తెలియక (అజ్ఞానం వల్ల) పట్టుకొన్న వాటిని దూరం చేసుకోవటమే సాధన. ముక్తుడు జన్మను గురించిగానీ, జన్మరాహిత్యాన్ని గురించిగానీ ఆలోచించడు. ఉన్న స్థితి నుండి, మార్పును కోరుకోవడం కోరిక అవుతుంది. ముక్తుడు ఉన్న స్థితిని గురించిగానీ, లేని స్థితిని గురించి గానీ ఆలోచించడు. అతడు భూత, వర్తమాన, భవిష్యత్తుల గురించి ఆలోచించడు, కాని పనులు మాత్రం చేస్తుంటాడు.

బద్ధుడు ఆలోచిస్తాడు, పనులు చేస్తుంటాడు; బంధాన్ని యింకా పెంచుకుంటాడు. కానీ, బద్ధుడు, బుద్ధుడు కావాలి. ఆ ప్రయత్నం నిరంతరం సాగాలి. ముక్తుడు విముక్తుడు కావాలి. ముక్తునకు నేను ముక్తుడినన్న భావముండదు.

ముక్తి అనుభవరహిత స్థితి. బంధము అనుభవాల పుట్ట.

మీరూ ఆలోచించండి.





# మాతృసంస్థ కబుర్లు

ఫిబ్రవరి 22వ తేదీ మధ్యాహ్నం 'ప్రశాంతి' వానప్రస్థాశ్రమ ప్రాంగణంలో వృద్ధులకు ఆటలలో, పాటలలో, మాటలలో రకరకాల పోటీలు నిర్వహింప బడ్డాయి. పాతికమంది వృద్ధ మాతలు, పెద్దలు వీటిలో పాల్గొన్నారు. వేగంగా నడవటం, కుర్చీల ఆట, పాటలు, చూచిన వస్తువులన్నీ గుర్తు పెట్టుకొని వ్రాయటం, విన్న వాక్యాలు తిరిగి వ్రాయటం, రామాయణంలోని పేర్లు ఒకే గొలుసుగా చెప్పటం-అలా వృద్ధులు పాల్గొనగలిగిన వాటిలోనే పోటీలు పెట్టటం జరిగింది. నవ్వులు, చెణుకులు, వాదులాటలు (సరదాగా), పడటాలు లేవటాలతో సహా పిల్లల్లాగే ఉత్సాహంగా పాల్గొన్నారు- సంధ్య, ప్రశాంతి భవనవాసులైన వృద్ధ బాలబాలికలందరూ.

నోట్ : వృద్ధులు, ముసలివాళ్లు అనకూడదు-సీనియర్ సిటిజన్స్ అనాలి అని నా చెవిలో జోరీగలాగా రొద పెడుతున్నాడు మా చిట్టిగాడు. ఎందు కనాలిరా? అంటే వాళ్లు బాధపడకుండానట! బాల్యం, యౌవనం, వృద్ధాప్యం-యివన్నీ అత్యంత సహజమైన దశలు మానవ జీవితంలో. ఎవ్వరూ తప్పించుకోలేనివి. దేని విలువ దానిదే. బాల్యంలో నిర్మలానందం, యౌవనంలో శారీరకానందం, జీవనానందం ఎలాగో వార్ధక్యంలో అనుభవానందం ప్రశాంతతా ఉంటాయి. పైగా దైవానికి దగ్గరగా వెళ్లడానికి ఎంచక్కని అవకాశం దొరుకుతుంది కూడా. ఎక్కడో శీతాకాలం మధ్యలో కోకిలపాట వినపడలేదనో-శిశిరంలో మామిడిపళ్లు దొరకలేదనో దుఃఖించే అలవాటుండేవాళ్లను మనమేమీ చెయ్యలేం. కానీ అత్యంత సహజంగా ఆయా ఋతువులలో దొరికే వాటితో ఎలా సర్దుకుంటామో, ఆనందిస్తామో-వృద్ధాప్యపు ప్రశాంతతనీ, పని భారాలు వదిలిపోయిన నిర్లిప్తతనీ అలాగే ఆనందించటం నేర్చుకోవాలి. వయసులో ఉన్నప్పటి ఎన్నెన్నో సమస్యలు ఇప్పడుండవు. పైగా దిగవలసిన స్టేషన్ దగ్గరకు వస్తున్నప్పడు

రైలు ప్రయాణికుడిలో ఉండే ఒకానొక రిలీఫ్ యీ వయసులో దొరుకుతుంది. దాన్ని ఫీలవ్వాలి-అంతే. ఈ మాటలన్నీ మా చిట్టిగాడికి చెప్పినా అర్థం కావు - కోడె వయసు గదా!

మొత్తం మీద మా పెద్ద తల్లులూ, తండ్రులూ అందరూ హాయిగా ఓ రెండు గంటల సేపు బాగా ఆనందించారు ఆ రోజు.

24 ఫిబ్రవరి ఆదివారం. ఆ రోజు సాయిధామంలోని పాఠశాల తరపున "శ్రీ సాయిగ్రామ కళ్యాణం" అనే పేరుతో ఒక క్రొత్త కార్యక్రమం ప్రారంభించబడింది. ఆశ్రమానికి పరిసరాలలో ఉన్న కొన్ని గ్రామాలలో సంస్కారం, సంస్కృతి, సంప్రదాయపు విలువలు పెంచాలన్న లక్ష్యంతో యీ కార్యక్రమం రూపుదిద్దుకొన్నది. గ్రామపరిశుభ్రత, వారానికొకసారి గ్రామీణులందరూ ఒకచోట చేరి మంచిచెడులు, కష్టసుఖాలు, ఆ వారంలో దేశంలో జరిగిన విశేషాలు చర్చించుకోవటం-ఆధ్యాత్మిక ప్రగతి-యువజన సమాఖ్యలను సేవామార్గంవైపు మళ్లించటం - గ్రామంలో కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతమైన ఒక సమైక్యతా (అనుబంధ) స్ఫూర్తి నింపటం-యివన్నీ క్రమక్రమంగా సాధించాలన్నది యీ ప్రణాళిక లక్ష్యం. ఈ సంకల్పాన్నిచ్చిన సాయినాథులవారే దీన్ని సిద్ధింపజేస్తారన్న విశ్వాసంతో 24 ఉదయం ఏడు గంటలకు ఏభైమంది, శ్రీ సాయి విద్యాధామం విద్యార్థులు, ఐదుగురు ఆశ్రమ కార్యకర్తలు, కొద్దిమంది గ్రామీణులు కలిసి పారిశుధ్ధ్య కార్యక్రమం ప్రారంభించి పది గంటల వరకు కార్యక్రమం నిర్వహించారు.

తదుపరి స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో అందరూ సమావేశమైనారు. పరమపూజ్య గురుదేవులు కూడా వేంచేయటంతో పూజా కార్యక్రమం ప్రారంభమైంది. చిన్నచిన్న గొంతులన్నీ ఒక్కసారిగా పాడిన హారతి పాటతో ఆలయం ప్రతిధ్వనించింది. మాతాజీ గ్రామీణులను, పిల్లలను అభినందించారు. గ్రామవాసులైన మా పూర్వవిద్యార్థులను, ఉపాధ్యాయ బృందాన్ని ప్రత్యేకంగా పేర్కొన్నారు. ప్రసాదాలు చేసిన వారికి





ఆశీస్సులిచ్చారు. చిన్నగ్రామాన్ని ఇంత చెత్తతో నింపుకోవటం బదులు ఎప్పటికప్పడు శుభ్రం చేసుకోవటం మంచిదనీ, ఎవరో వస్తారనీ, ఏదో చేస్తారనీ ఎదురుచూడటం కన్నా స్వయంశక్తి పెంచుకోవటం మంచిదనీ వివరించారు. బాలబాలికలందరూ "మేము హిందువులం" అని సగర్వంగా చెప్పకోగలగాలనీ, నుదుటబొట్లు కనిపడేలా పెట్టుకొమ్మని నేర్పమనీ, ఇంటింటా దీపం పెట్టే అలవాటు చేసుకొమ్మనీ తల్లులను ఉద్బోధించారు. అటుపైన గురుదేవులు తమ ఆశీఃప్రసంగంలో సాయిబాబావారు ఇక్కడ నెలకొనటం యీ గడ్డ చేసుకున్న పుణ్యమనీ, వారి బోధలను అనుసరించి ధన్యులు కమ్మనీ సెలవిచ్చారు. గ్రామగ్రామాన యువజనుల మధ్య గ్రామీణ క్రీడల పోటీలు, విద్యార్థులలో వ్యాసరచన, వక్తృత్వం మొదలైన పోటీలు నిర్వహిస్తూ జిల్లావ్యాప్తంగా వాటిని తీసుకువెళ్లాలనుకొంటున్నామనీ, ఇందుకు ఉత్సాహంగా గ్రామయువత ముందుకురావాలనీ ఉద్బోధించారు. కాలక్రమంలో గ్రామంలోని సమస్యలన్నిటినీ స్వయంగా, స్వాభిమానంతో పరిష్కరించుకొనే ప్రయత్నం జరగాలనీ, శ్రీ సాయి అందుకు తగిన శక్తి వారికివ్వాలనీ ఆశీస్సులు పలికారు. తదుపరి గ్రామీణులు లింగంగారు గురుదేవులకు కృతజ్ఞతలు తెలియజేశారు. దానితో సభ ముగిసింది.

ఫిబ్రవరి 25, ఆదివారంనాడు ఉద్దమర్రి గ్రామానికి చేరువలో ఉన్న లింగాపూరు తండాలో వివేకానంద, సేవాలాల్‌ల (వీరు తండా ప్రజల కులగురువు) పేరిట ఒక కార్యక్రమం తీసుకోబడింది. తండా కలిమి కలిగినదే అయినా చైతన్యం తక్కువగా ఉంది. కార్యకర్తలు కూడా చురుకుగా లేరు. అయినాగానీ అక్కడి పాఠశాల ప్రాంగణంలో ఉదయం తొమ్మిది గంటలకు కార్యక్రమం ప్రారంభించాము. కొంతమంది పెద్దలు, అరవై డెబ్భై మంది బడి పిల్లలు హాజరయ్యారు. శ్రీ మంగారెడ్డిగారు, శ్రీ చంద్రారెడ్డి గారు, చంద్రన్న మొదలైన విద్యాధికులు కూడా అక్కడికి వచ్చారు. సేవాలాల్ గారి చిత్రపటం ముందర గ్రామీణుల చేత పూజ చేయించారు. స్వామీజీ తదుపరి గురుదేవులు వివేకానందుల గురించీ,

సేవాలాల్‌గారి గురించీ, హైందవ ధర్మంలోని విలువలగురించీ లఘువుగా ప్రవచించారు. ఆ తండా వాసులలో ఇద్దరు క్రైస్తవంలోకి మారి తప్పు తెలిసి తిరిగి త్రోవలోకి వచ్చి సభకు వచ్చారు. వారికి, మరికొందరికి సాయి ధామం తరఫున దుప్పట్లు పంచాము. తీసుకువెళ్లిన ప్రసాదాలు అందరికీ పంచి, పిల్లలకు మిఠాయిలు కూడా యిచ్చాము. దానితో సభ ముగిసింది.

25వ తేదీ మాఘపూర్ణిమ-మహామాఘి. శ్రీ సాయినాథ వ్రతం యథావిధిగా ద్వారవతిలో జరిగింది.

మార్చి 3వ తేదీ ఉదయం మా కార్యకర్తలు, పిల్లలు అంతా కలిసి 'సాయిగ్రామ కళ్యాణం' కోసం అంకిరెడ్డిపల్లె గ్రామం వెళ్లారు. అక్కడ పిల్లలను కలుపుకొని ఆ గ్రామ పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. దాదాపు రెండు గంటలసేపు యీ కార్యక్రమం నడిచింది. అటుపైన స్థానిక శ్రీరామాలయంలో సమావేశం ఏర్పాటైంది. మెల్లమెల్లగా ఆలయం నిండిపోయింది. స్థానిక ఆశ్రమ నిర్వాహకులు శ్రీ సత్తెయ్యగారు కూడా వచ్చారు సభకు. సాయి ముందు దీపారాధన చేసి, పిల్లలు నాలుగు భజనలు చెప్పాక, మాతాజీ సేవ చేసిన పిల్లలను అభినందించారు. వారికి తోడ్పడిన పెద్దలందరినీ ఆశీర్వదించారు. భారతీయులు అనాదిగా హిందువులనీ, హిందువు జీవించవలసిన పద్ధతులు కొన్నింటిని మన పూర్వ ఋషులు నిర్దేశించారనీ, అందులో మొదటిది శౌచమనీ చెప్పారు. తనువు శుభ్రంగా ఉంటేనే మనసు శుభ్రంగా ఉంటుందన్నారు. గ్రామాన్ని శుభ్రంగా ఉంచుకొంటే గ్రామీణుల జీవనం శుభ్రపడుతుందనీ, ముందు బాహ్యశౌచం సరిగా ఉంటే ఆంతరశౌచం తరువాత వస్తుందనీ సరళంగా వివరించారు. సింహాల వంటి హిందువులు తరతరాలుగా వస్తున్న ధర్మాన్ని సంస్కృతిని మరచిపోయి గొర్రెల్లా బ్రతుకుతున్నారనీ, జాతి సంరక్షణ కోసం యిప్పుడైనా లేచి నడుంకట్టాలని ఉద్బోధించారు.

తదుపరి పరమపూజ్య గురుదేవులు భారతీయుల ప్రాచీన ఘనతను వివరించి, నేటి దుస్థితిని స్పృశించారు. జాతిధర్మాన్ని మరచి విజాతీయులను అనుకరించడాన్నీ, స్వరాజ్య పోరాటం విదేశీయులను పారద్రోల





డానికి పనిచేసిందని మరచిపోయి, మళ్లీ విదేశీయులకే పట్టం కట్టే దౌర్భాగ్య పరిస్థితికి రావడాన్నీ ఖండించారు. నేటి బాలబాలికలంతా చైతన్యస్ఫూర్తితో పెరిగి, తమ సంస్కృతినీ, విలువలనూ పెంచుకొని తమదైన జాతి ప్రతిష్ఠను తిరిగి తెచ్చుకోవాలని మంగళాశాసనం చేసారు.

మాన్యులు శ్రీ సత్తెయ్యగారు మాట్లాడుతూ మహాత్ముల దర్శన- స్పర్శన, సంభాషణలు ఎంతో శ్రేయస్కరమనీ, అయాచితంగా అలాటి మహాపురుషులు రాక భాగ్యమనీ, సాయిధామం సేవకు ఇస్తున్న విలువ అభినందనీయమనీ, ఈ ఆశ్రమ సేవలను, మహాపురుషసంశ్రయాన్నీ గ్రామీణులు చక్కగా ఉపయోగించుకోవాలనీ ప్రబోధించారు.

సేవ కోసం వచ్చిన వారందరికీ అల్పాహారాలు, మధ్యాహ్నం అన్నప్రసాదాలు ఏర్పాటు చేసి స్థానిక భక్తులు తమ చైతన్యాన్ని ఋజువు చేసుకున్నారు; గురుదేవులను, సత్తెయ్యగారిని సన్మానించుకొన్నారు. ఇదే ఉత్సాహాన్ని అన్నివేళలా చూపిస్తూ జనజాగృతిని కలిగించి, హైందవ ధర్మపరిరక్షణకు తరలిరావలసిందిగా ఆ చిరంజీవులందరికీ యిదే మా ఆశీస్సులూ, అభినందనలూను.

మార్చి 6వ తేదీ ఉదయం ఏడున్నరకు బయలుదేరి మైలారం తండాకు చేరుకొన్నాం శ్రీ సాయి విద్యాధామం తరఫున. అది చిన్న తండా. చిన్న కమ్యూనిటీ సెంటర్ తప్ప ఏ ప్రభుత్వ సౌకర్యమూ లేదక్కడ. బస్సెక్కాలంటే రెండు మైళ్లు (దాదాపు) నడవాలి. ఎక్కువగా వ్యవసాయమే ఆధారం. మేం వెళ్లేసరికి కమ్యూనిటీ సెంటర్ కడిగి ముగ్గులు పెట్టి ఉంది. షామియానా, పట్టాలు వేసారు. వేన్ శబ్దం వింటూనే బిలబిలమంటూ ముందు పిల్లలు, వెనుక పెద్దలు అంతా వచ్చారు. దాదాపు గ్రామం అంతా అక్కడికి చేరగానే పూజా కార్యక్రమం ప్రారంభమైంది. గ్రామస్థులలోనే ఒక జంటతో పూజ చేయించాము. క్రిందటి సాయంత్రమే 'శ్రీ సాయి గ్రామ కళ్యాణం' కార్యక్రమం నడిచింది అక్కడ. మా కార్యకర్తలు, గ్రామీణ బాలబాలికలు కలిసి గ్రామ శరీరం శుభ్రం చేసారు. ఇప్పుడిక జ్ఞానబోధకై గురువుగారు తరలివచ్చారు. మొదట గురుదేవుల పరిచయం, ఆశ్రమ

పరిచయం జరిగాక-మాతాజీ ఓంకారం చెప్పించి, హిందూధర్మం గురించి వివరించారు. "ఒక వృక్షాన్ని చూపించి 'ఇదేం చెట్టు?' అని అడిగితే చెట్టు పేరు చెప్తాము. నీళ్లు వేళ్లు పీల్చుకోవడానికి వీలుగా పాదులో పోస్తాం. అలాగే 'మీరెవరు?' అనే గుర్తింపు మొదట మన ధర్మంతో రావాలి గానీ కులాలతో కాదు. అందుచేత మొట్టమొదట మేము భారతీయులం, హిందువులం-అని చెప్పాలి. హిందువు అంటే ఎలా ఉండాలో నేర్చుకోవాలి. మనం పాపులం కాదు, అమృతపుత్రులం. దానికి తగినట్లు కట్టు, బొట్టు, భావం అన్నీ ఉండాలనీ-స్వావలంబన ఉన్నపుడు యీనాటి దుర్దశ రాదు" అని వివరించారు.

తదుపరి గురుదేవులు లంబాడీల కులగురువైన సేవాలాల్‌జీ గురించి, వారి జీవనరీతి గురించీ విశదీకరించారు. లంబాడీ జాతిలోనే పుట్టి (బళ్లారి ప్రాంతాలలో) దేశమంతా తిరిగి, భవానీ మాతపై భక్తినీ, దేశం పట్ల ధర్మం పట్ల అనురక్తినీ పెంచిన మహనీయుడు సేవాలాల్. ఐక్యంగా ఉండమనీ, ధర్మహాని జరగనివ్వరాదనీ, మాతా పితృ సేవ, గురుభక్తి, అతిథి సేవ తప్పరాదనీ సేవాలాల్‌జీ చెప్పారన్నారు. 274 సంవత్సరాల క్రితం వారు చేసిన బోధలను క్షణక్షణం గుర్తు పెట్టుకోవాలని ఆయన వివరించారు. హిందూ దేవతలను, ధర్మాన్ని ఎవరు కించపరిచినా సహించి ఊరుకో రాదనీ, పిల్లలలో కూడా ధార్మిక చైతన్యాన్ని పెంచమనీ గురుదేవులు ఉద్బోధించారు. అటుపై అందరినీ ఆశీర్వదించారు. తరువాత సభలో ఉన్న రాములుగారనే ఎల్.ఐ.సి. ఏజెంటొకాయన తాముగా ముందరకు వచ్చి మాట్లాడారు. తాము ఒక తండాకు (బీబీనగర్ దగ్గరలో బట్టు గూడెం (గుర్రాలదండి) చెందినవాడిననీ, తమ తండాకు క్రైస్తవ ప్రచారకులు వచ్చేవారనీ, వారు రోగాలు పోతాయనో, ఏదైనా మేలు కలుగుతుందనో, డబ్బులబ్బో, మరొకటో మరొకటో చూపించి తమ వాళ్లందరినీ ఆ మతంలోకి లాగేసారనీ వివరించారు. స్వయంగా తన తల్లీతండ్రీ బంధువులూ అందరూ ఆ మాయలోనే పడిపోయి తనను కూడా లాగే ప్రయత్నం చేస్తే "నేను హిందువుగా పుట్టాను. హిందువుగానే చస్తాను





తప్ప దారి తప్పను" అన్నానని చెప్పారు. "ఈ మతం మారిన వాళ్లు తాము క్రిస్టియన్లమని చెప్పకోవాలే తప్ప ఎస్టీలం, ఎస్సీలం, ఫలానా కులాల వాళ్లం అని చెప్పకోకూడదు. కానీ వాళ్లు ఇటు రిజర్వేషన్ల లాభమూ పొందు తున్నారు-అటు చర్చి సేవా చేస్తున్నారు. దీనివలన జాతికెంతో నష్టం కలుగుతోంది. మీరు ఇలాంటి కార్యక్రమాలు ఎక్కువగా తండాలలోనే చేస్తే బావుంటుంది" అన్నారు రాములుగారు.

ఆ తరువాత అందరూ గురుదేవులకు నమస్కరించుకొని, ఆశీస్సులు తీసుకున్నారు. ప్రసాదస్వీకారంతో సభ ముగిసింది. గ్రామస్థులైన పెద్ద పిల్లలు మహేంద్ర, సురేశ్‌లు అందించిన జొన్నరొట్టెలు తీసుకొని పదిగంటల కల్లా యింటికి చేరుకొన్నాము.

మార్చి 9వ తేదీ శ్రీ సాయి విద్యాధామంలో పదవ తరగతి పిల్లలకు వీడ్కోలు సభ జరిగింది. ఎల్కేజీ నుండి ఇక్కడే చదువుకొన్న పిల్లలు కొందరు "బుడి బుడి నడకలతో, వచ్చీరాని మాటలతో యిక్కడికి వచ్చాము. వెనక్కు తిరిగి ఒక్కసారి చూచుకొంటే కాలం ఎంత తొందరగా గడిచి పోయింది. ఇంతలో ఎంత పెద్దవాళ్లమైపోయాం అని ఆశ్చర్యం కలుగు తుంది- అని తమ చిన్ననాటి జ్ఞాపకాలు తడిచిచూచుకొన్నారు. ఏ ఐదవ తరగతిలోనో వచ్చినవారు ఆరు, ఏడులలో వచ్చినవారు తాము చిన్ననాడు చదివిన పాఠశాలలకన్నా యీ బడి ఎలా విభిన్నంగా ఉందో చెప్పారు. "ఎన్నెన్నో తప్పలు చేసాం. దెబ్బలు తిన్నాం. కానీ అవన్నీ మాకు జ్ఞానాన్నే యిచ్చాయి. నిజానికి మా గురువులను ఎంతో బాధపెట్టాం. వాళ్లు ప్రేమతో, దయతో మమ్మల్ని దారిలోకి తేవడానికి ఎంతో చేసారు" అని కొందరన్నారు. మొత్తం మీద అందరూ ఏకగ్రీవంగా చెప్పినది ఒకటే-"పాఠాలు ఇంకెక్కడైనా కూడా నేర్చుకొనేవాళ్లమేమో! కానీ, ఇక్కడ మేము నేర్చుకొన్న మానవతా విలువలు, దైవచింతన-ముఖ్యంగా దేశభక్తి, పది మంది కోసమే జీవించాలన్న తపన, సేవ అనేది మనిషి కనీస ధర్మమన్న భావన-యివన్నీ యింకెక్కడా దొరికి ఉండేవికావు. దీనికి కారణం మా గురువులు, నిర్వాహకులు నిస్వార్థపరులు, త్యాగశీలురు, ప్రేమగలవారు కావటమే"

అని. చిరంజీవులు రాజేశ్వరి, వంశీధర్, చిట్టిబాబు, రుక్మిణి, పూజ బాల రాజు, మహేందర్, మమత, వినయ్, అంకిత్ యింకా చాలామంది తమ భావాలు ఉద్విగ్నకంఠాలతో కన్నీటి దొంతరలతో అందరితో పంచుకొన్నారు. ముఖ్యంగా రాజేశ్వరి చాలా విపులంగా చక్కని భాషతో మాట్లాడి ఆకట్టుకొన్నది. తొమ్మిదవ తరగతి పిల్లలు ఓ చిన్న నాటిక, కోలాటం, చిన్న చిన్న ఉపన్యాసాలతో తమ అక్కలను అన్నలను అలరించి అల్పాహారవిందు చేసారు. చిన్న కానుకలు కూడా యిచ్చారు. పదవతరగతి పిల్లలు గురుదేవులను దక్షిణ తాంబూలాలతో సత్కరించుకొని ఉపాధ్యా యులందరికీ పుష్ప, ఫల తాంబూలాలిచ్చి నమస్కరించుకొన్నారు. కొద్దిమంది ఉపాధ్యాయులు కష్టానికీ సుఖానికీ కూడా తొణక్కుండా ఉండమనీ, ఎంత ఎత్తుకు వెళ్లినా మూలం మరిచిపోవద్దనీ హితవు చెప్తూ ఆశీస్సులందించారు.

పరమపూజ్య గురుదేవులు తమ ఆశీఃప్రసంగంలో గురువులు బల్లకట్టుల వంటివారనీ, కాలవ దాటించి ప్రయాణీకులను అవతలి ఒడ్డుకు చేర్చే కర్తవ్యాన్ని సమర్థవంతంగా నిర్వహించటమేగానీ బల్లకట్టు తాను స్వయంగా ఆవలి ఒడ్డుకు చేరి విశ్రాంతిగా పడుకోదనీ, అచ్చపు గురువులు జీవితాంతం ఏదో ఒక రీతిన సమాజశ్రేయస్సును కోరి సద్బోధలు చేస్తూనే ఉంటారనీ అన్నారు. నిజాయితీతో ధర్మం కోసం, దేశంకోసం నడుం బిగించి పనిచేయమని విద్యార్థులను ఉద్బోధించి, ఆశీస్సులందించారు. తదుపరి మాతాజీ త్రికరణశుద్ధితో ఉన్న వాడికి జీవితంలో భయం, ఓటమీ ఉండవ న్నారు. క్లప్తత, గుప్తత, నిర్లిప్తత ఉన్నవాడికి ఎదురులేదనీ, మన దేశంలో నిజాయితీకి, నిర్విరామకృషికీ నిలయమైన మహానాయకులెందరో ఉండేవారనీ, వారిని స్మరించుకొంటూ ఆ త్రోవన నడవాలనీ చెప్పారు. ఎందరెందరో ఋషులకు జన్మనివ్వటమేగాక యీ భరతమాత స్వయంగా ఎన్నో భగవదవతారాలు యీ గడ్డ మీది మోసిందనీ, యీ తల్లిని పదిలంగా కాపాడుకొంటే హైందవ సంస్కృతీ ధర్మాలు కలకాలం పచ్చగా ఉంటాయనీ, ప్రస్తుతం భరతమాతనే ఆరాధ్యదైవంగా భావించాలనీ ప్రబోధించారు. అటుపైన విద్యార్థులను విజయీభవ అని ఆశీర్వదించారు.





పిల్లల కృతజ్ఞతాసమర్పణతో సభ ముగిసింది.

మార్చి 10వ తేదీ శివరాత్రి. పగలు భక్తుల రాకపోకలతో, పూజాదికాలతో గడిచిపోయింది. సాయంత్రం బొమ్మలరామవరం గ్రామంలో శివ కళ్యాణం జరుగుతున్నదనీ, అక్కడ సమావేశమైన భక్తులకు తమ మంగళాశీస్సులు అందించమనీ భాస్కర్‌గారు వచ్చి గురుదేవులను ప్రార్థించటంతో అక్కడికి వెళ్లారు గురుదేవులు. ఆ సభలో శివావిర్భావగాథను వివరించి చెప్పారు. పార్వతీపరమేశ్వరుల దాంపత్యంలోని వైశిష్ట్యం గురించీ, ఆ కళ్యాణం చేయటం వెనుకగల అంతరార్థం గురించీ తెలియజెప్పారు. అటుపైన ఉపవాసం అంటే భగవత్సమీపాన నివసించటమనీ, దానికి ఆహారం లేకుండా ఉండటం అన్నది (నిద్ర రానీయకుండా) సహకరిస్తుందనీ ఆ తిండి ఏర్పాట్లు, తినటం - వీటికి పట్టే సమయం కూడా స్వామి స్మరణకే ఉపయోగించుకోవచ్చనీ, అందుచేత యీ నిరాహారంగా ఉండటం అన్నది పెట్టారే తప్ప 'ఛేంజ్ ఆఫ్ ఫుడ్" ఉపవాసం కాదనీ స్పష్టీకరించారు. పరమ శివుని తత్త్వం అంటే నిరాడంబరత, వైరాగ్యం, నిర్మలత్వం (బోళాతనం) అని సోదాహరణంగా విపులీకరించారు. చివరిగా-ఏది చేసినా భావనతో చెయ్యమనీ, యాంత్రికంగా చేయవద్దనీ హితవు చెప్తూ సభ్యులందరికీ శ్రీసాయీశ్వరుని ఆశీస్సులు అందజేసారు. గురుదేవులను గ్రామీణులు శాలువా కప్పి సత్కరించుకొన్నారు.

ఆ రాత్రి తొమ్మిది గంటలకు ద్వారవతిలో ఆశ్రమవాసులు సమావేశమయ్యారు. చక్కని భజనలు, స్తోత్రాలు, నాట్యాలు, కోలాటాలు-మహోత్సాహంగా సాగాయి. శివనామ సంస్తుతి వీనులవిందు చేసింది. పదకొండున్నరకు శివుని మీద ఒక ప్రశ్నావళి ఇచ్చి, సమాధానాలు వ్రాయించారు మాతాజీ. అంతలో పన్నెండు గంటలైంది. లింగోద్భవ వేళ గనుక ప్రతి సంవత్సరం లాగానే క్షీరాభిషేకం జరిగింది స్వామికి. ఆలయంలోని వారంతా యీ అభిషేకంలో పాల్గొని ఆనందించారు. అటుపైన అష్టోత్తర శతనామ పూజ, మహా మృత్యుంజయ స్తోత్రం చేసారు. అలా నందన శివరాత్రి గడిచిపోయింది.